సాక్షి
వికారాబాద్

ఆదివారం । 4 । జూన్ । 2023



అంబరమంటిన సంబరం

జిల్లా వ్యాప్తంగా రాష్ట్ర అవతరణ సంబరాలు వైభవంగా కొనసాగుతున్నాయి. రెండో రోజైన శనివారం రైతు దినోత్సవం నిర్వహించారు. 10లో▸



దేశానికే ఆదర్శం

రైతు సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యమని బీఆర్ఎస్ నాయకులు తెలిపారు. కేసీఆర్ హయాంలోనే మంచి రోజులు వచ్చాయన్నారు. 11లో▸



బడుల్లో చేర్పించండి

బడీడు పిల్లలందరూ పాఠశాలలకు రావాలని ఉపాధ్యాయులు కోరారు. శనివారం బడిబాట కార్యక్రమాన్ని ప్రారంభించారు. 11లో▸

కేసుల రాజీకి సదావకాశం

- 10న జాతీయ లోక్ అదాలత్
- జిల్లా ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సుదర్శన్
- పోలీసు అధికారులతో సమావేశం

వికారాబాద్ అర్బన్: వికారాబాద్‌లో ఈ నెల 10న నిర్వహించే జాతీయ లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ కె.సుదర్శన్ అన్నారు. ఈ మేరకు శనివారం ఆయన కోర్టు ఆవరణలో పోలీసులతో సమన్వయ సమావేశం నిర్వహించారు. అధిక సంఖ్యలో కేసులు రాజీ కుదిరేలా చూడాలని సూచించారు. ఇందులో భార్యాభర్తల కేసులు, కుటుంబ తగాదాలు, మోటర్ వెహికిల్ ప్రమాదాలు, బ్యాంకుల్లో అప్పు తీసుకొని అవి కట్టలేక వడ్డీ పేరుకుపోయిన కేసులను లోక్ అదాలత్‌లో రాజీ కుదుర్చుకోవచ్చని తెలిపారు. తెలిసీతెలియక చేసిన చిన్నచిన్న తప్పులతో కేసుల్లో ఇరుక్కుని సమయం వృథా చేసుకుంటున్నామని భావించే వారు తమ తప్పును ఒప్పుకొంటే జరిమానా విధించి కేసు కొట్టేస్తామని చెప్పారు.



సమీక్షలో మాట్లాడుతున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి సుదర్శన్

ఆబ్కారీ శాఖలో కూడా రాజీ పడదగిన కేసులను రాజీ కుదుర్చవచ్చని వివరించారు. ఈ విషయాన్ని సంబంధిత శాఖల అధికారులకు కూడా తెలియజేశామన్నారు. కేసుల పరిష్కారం కోసం రాజీ చేసుకోవాలని ఎదురుచూసే వారికి ఇది మంచి అవకాశమని స్పష్టంచేశారు. కార్యక్రమంలో ఒకటో అదనపు న్యాయమూర్తి చంద్రకిషోర్, ప్రిన్సిపల్ జూనియర్ జడ్జి కె.శ్రీకాంత్, అదనపు జూనియర్ జడ్జి శృతిదూత, పబ్లిక్ ప్రాసిక్యూటర్లు రాజేశ్వర్, అన్వేష్ సింగ్, సమీనాబేగం, అడిషనల్ ఎస్పీ మురళీధర్ తదితరులు పాల్గొన్నారు.

రైతు మెచ్చిన పాలన

తెలంగాణలో సంక్షేమ యుగం

- ఇంటింటికీ కేసీఆర్ పథకాలు అందుతున్నాయి
- విద్యాశాఖ మంత్రి సబితారెడ్డి

కొడంగల్: తెలంగాణ రాష్ట్రంలో సంక్షేమ యుగం కొనసాగుతోందని విద్యాశాఖ మంత్రి సబితాఇంద్రారెడ్డి అన్నారు. శనివారం పట్టణంలో పలు అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపన, ప్రారంభోత్సవాలు చేశారు. ప్రభుత్వ ఆస్పత్రి ఆవరణలో రోగుల విశ్రాంతి భవనానికి, గాంధీనగర్ సమీపంలో అంబేడ్కర్ భవనానికి భూమి పూజ చేశారు. నూతనంగా నిర్మించిన గ్రంథాలయ భవనం, బస్తీ దవాఖానా, బస్‌షెల్టర్‌ను ప్రారంభించారు. కొడంగల్ వ్యవసాయ మార్కెట్ కమిటీ ఆవరణలో నూతన పాలక మండలి సభ్యులతో ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన బహిరంగ సభలో మంత్రి మాట్లాడుతూ.. సీఎం కేసీఆర్ రాష్ట్రంలో రైతులు మెచ్చిన పాలన చేస్తున్నారని కొనియాడారు. ప్రతీ ఇంటికి సంక్షేమ, అభివృద్ధి పథకాలు చేరుతున్నాయన్నారు. తెలంగాణ ఏర్పాటుకు ముందు.. తర్వాత పరిస్థితులను రైతులకు వివరించారు. వ్యవసాయానికి 24 గంటల పాటు ఉచిత కరెంటు, రైతుబంధు, రైతుబీమా ఇచ్చి ఆదుకుంటున్నామన్నారు. పాలమూరు ప్రాజెక్టును పూర్తి చేసి త్వరలోనే ఈ ప్రాంతానికి తాగునీరు అందిస్తామని తెలిపారు. సాగునీరు అందించడానికి సీఎం కేసీఆర్ ప్రయత్నిస్తే కోర్టుల్లో కేసులు వేసి అడ్డుకుంటున్నారన్నారు.

ఘనంగా దశాబ్ది ఉత్సవాలు

ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి మాట్లాడుతూ. దశాబ్ది ఉత్సవాలను ఘనంగా నిర్వహిస్తున్నట్లు చెప్పారు. సీఎం కేసీఆర్, మంత్రులు కేటీఆర్, హరీష్‌రావు, సబితమ్మ ఈ ప్రాంతం అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి పెట్టి అధిక మొత్తంలో నిధులు కేటాయించి సహకరిస్తున్నారని అన్నారు. పల్లె, పట్టణ ప్రగతి కార్యక్రమాలతో మౌలిక వసతులు సమకూరుతున్నాయని, పారిశుద్ధ్యం మెరుగుపడిందని తెలిపారు.



ఎడ్ల బండిపై ర్యాలీగా వస్తున్న మంత్రి సబితారెడ్డి, ఎమ్మెల్యే నరేందర్‌రెడ్డి

మార్కెట్ కమిటీ ప్రమాణ స్వీకారం

మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్‌గా సుజాత, వైస్ చైర్‌పర్సన్‌గా వాణిశ్రీ, డైరెక్టర్లుగా మరో 12 మంది ప్రమాణ స్వీకారం చేశారు. రైతులకు మెరుగైన సేవలు అందిస్తామని స్పష్టంచేశారు. కార్యక్రమంలో ఎంపీ శ్రీనివాస్‌రెడ్డి, మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ ఉషారాణి, జెడ్పీటీసీ మహిపాల్, గ్రంథాలయ సంస్థ చైర్మన్లు శ్యాసం రామకృష్ణ, రాజుగౌడ్, ఎంపీపీ విజయకుమార్, పీఏసీఎస్ చైర్మన్ శివకుమార్ గుప్త, మున్సిపల్ కమిషనర్ ప్రవీణ్‌కుమార్‌రెడ్డి, వైద్యాధికారి పాల్వన్‌కుమార్, ఉప వైద్యాధికారి డాక్టర్ రవీంద్రాయాదవ్, కౌన్సిలర్ మధుసూదన్‌రావ్ యాదవ్, బీఆర్ఎస్ నాయకులు మోహన్‌రెడ్డి, ప్రమోద్‌రావ్, చాంద్‌పాష పాల్గొన్నారు.

అంబరమంటిన రైతు సంబరం

- జిల్లాలో వైభవంగా రైతు దినోత్సవం
- పాల్గొన్న ప్రజాప్రతినిధులు, అధికారులు
- ప్రత్యేక ఆకర్షణగా నిలిచిన ఎడ్లబండ్లు

జిల్లా వ్యాప్తంగా రాష్ట్ర అవతరణ సంబరాలు వైభవంగా కొనసాగుతున్నాయి. ఉత్సవాల్లో రెండో రోజైన శనివారం రైతు దినోత్సవం నిర్వహించారు. రైతు వేదికల వద్ద ఏర్పాటు చేసిన కార్యక్రమాలకు ఎమ్మెల్యేలు, అధికారులు, ఇతర ప్రజాప్రతినిధులు ఎడ్ల బండ్లపై వచ్చారు. తెలంగాణ ఏర్పాటు తర్వాత సీఎం కేసీఆర్ వ్యవసాయాన్ని పండుగ చేశారని కొనియాడారు. రైతులతో కలిసి సహపంక్తి భోజనాలు చేశారు.

అనంతగిరి: వికారాబాద్ మండలం నారాయణపూర్, గొట్టిముక్కల, సిద్దులూర్, మైలార్‌దేవరాంపల్లి గ్రామాల్లో శనివారం రైతు దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. గొట్టిముక్ల, నారాయణపూర్ సంబరాల్లో ఎమ్మెల్యే డాక్టర్ మెతుకు ఆనంద్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఎండ్లబండి, ట్రాక్టర్ నడిపి రైతులను ఉత్సాహపర్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సీఎం కేసీఆర్ అపర భగీరథుడని తెలిపారు. కార్యక్రమంలో జెడ్పీ సీఈఓ జానకీరెడ్డి, ఆర్డీఓ విజయకుమారి, రైతు సమన్వయ సమితి జిల్లా అధ్యక్షుడు రాంరెడ్డి, ఎంపీపీ చంద్రకళ, ఏఎంసీ చైర్మన్ ముద్ద దీప, పీఏసీఎస్ చైర్మన్ ముత్యంరెడ్డి, ఎంపీడీఓ సత్తయ్య, ఎంపీఓ నాగరాజు, ఏవో జ్యోతి, సర్పంచులు, ఎంపీటీసీలు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు. మైలార్ దేవరాంపల్లిలో జరిగిన సమావేశంలో డిప్యూటీ సీఈఓ సుభాషిణి, ఏడీఏ వినోద్‌కుమార్, సర్పంచులు పాల్గొనగా, సిద్దులూర్‌లో ఎంపీడీఓ కార్యాలయ సూపరింటెండెంట్ చెన్నారెడ్డి, పీఆర్ డీఈ మాధవరెడ్డి, సర్పంచులు ఆంజనేయులు, కమాల్‌రెడ్డి, పురుషోత్తంరెడ్డి, జయమ్మ నరేందర్‌రెడ్డి, రాములునాయక్, లలితమ్మ, ఆయా గ్రామాల సర్పంచులు, రైతులు, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

నాణ్యమైన కరెంటు

మోమిన్‌పేట: 'నేను రైతు బిడ్డనే.. రైతుల కష్టాలు నాకు తెలుసు' అని కలెక్టర్ సి.నారాయణరెడ్డి అన్నారు. మోమిన్‌పేట, మేకవనంపల్లిలో నిర్వహించిన రైతు వేడుకల్లో పాల్గొన్నారు. మోమిన్‌పేట రైతు వేదిక నుంచి ఏజేఆర్ ఫంక్షన్ హాల్ వరకు ఎడ్లబండి తోలారు. వ్యవసాయానికి నాణ్యమైన కరెంటు సరఫరా కోసం ప్రభుత్వం అనేక సంస్కరణలు చేసిందన్నారు. మిషన్ కాకతీయతో భూగర్భ జలాలు పెరిగాయని చెప్పారు. హరితహారంలో పెంచిన చెట్ల కారణంగా వర్షాలు పుష్కలంగా కురుస్తున్నాయని స్పష్టంచేశారు. పాలమూరు ప్రాజెక్టు పూర్తయితే సాగునీటి ఇబ్బందులు తీరుతాయన్నారు. ఈ కార్యక్రమంలో జెడ్పీ వైస్ చైర్మన్ విజయ్‌కుమార్, ఎంపీపీ డి.వసంతవెంకట్, మిషన్ భగీరథ ఎస్‌ఈ అంజనేయులు, డీసీసీబీ డైరెక్టర్ అంజిరెడ్డి, రైతుబంధు మండల కో ఆర్డినేటర్ అజీజ్, సర్పంచులు అంగేరి శ్రీనివాస్‌రెడ్డి, శశిధర్‌రెడ్డి, అంజయ్య, పార్వతమ్మ, సురేశ్, ఎంపీడీఓ శైలజారెడ్డి, ఏఓ జయశంకర్ తదితరులు పాల్గొన్నారు.

వ్యవసాయం పండుగైంది

తాండూరు రూరల్: తెలంగాణలో వ్యవసాయం పండుగలా మారిందని ఎమ్మెల్యే పైలెట్ రోహిత్‌రెడ్డి అన్నారు. దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా చెంగోల్, ఐనెల్లిలో నిర్వహించిన రైతు దినోత్సవంలో పాల్గొన్నారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ.. రైతులు కరెంటు కోతలతో ఇబ్బందులు పడేవారన్నారు. కేసీఆర్ పాలనలో 24 గంటల ఉచిత విద్యుత్ ఇస్తున్నారని తెలిపారు. రైతుబంధు, రైతు బీమా పథకాలు దేశానికి ఆదర్శంగా నిలుస్తున్నాయని అన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్డీఓ అశోక్ కుమార్, జెడ్పీటీసీ గౌడి మంజుల, వైస్ ఎంపీపీ స్వరూపరెడ్డి, సర్పంచులు స్వప్న జ్యోతి, సాయిలు, నాయకులు చంద్రశేఖర్‌రెడ్డి ఉన్నారు.



ట్రాక్టర్ నడుపుతున్న ఎమ్మెల్యే ఆనంద్

రైతును రాజును చేశారు

పరిగి: బీఆర్‌ఎస్‌ది రైతు ప్రభుత్వమని ఎమ్మెల్యే కొప్పుల మహేశ్‌రెడ్డి అన్నారు. రంగాపూర్‌లో నిర్వహించిన రైతు దినోత్సవంలో పాల్గొని మాట్లాడారు. తెలంగాణ రాకముందు రైతుల పరిస్థితి దయనీయంగా ఉండేదన్నారు. సీఎం కేసీఆర్ అధికారం చేపట్టిన తర్వాత రైతును రాజును చేశారన్నారు. వ్యవసాయానికి అనేక పథకాలు అమలు చేస్తున్న ఘనత ఆయనకే దక్కిందని తెలిపారు. కార్యక్రమంలో ఎంపీపీ అరవింద్‌రావు, జెడ్పీటీసీ హరిప్రియ, పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.



పరిగి: రంగాపూర్‌లో ఎడ్ల బండ్లు, ట్రాక్టర్ల ర్యాలీ

సంక్షేమంలో ఆదర్శం

కొడంగల్ రూరల్: రావులపల్లిలో నిర్వహించిన రాష్ట్ర ఆవిర్భావ సంబరాల్లో ఎమ్మెల్యే నరేందర్‌రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా రైతులు ఎడ్ల బండ్లతో తరలివచ్చారు. మహిళలు బోనాలతో వచ్చి ఎమ్మెల్యేకు ఆహ్వానం పలికారు. సీఎం కేసీఆర్ రైతులకు అండగా నిలుస్తున్నారని తెలిపారు. సంక్షేమ పథకాల అమలులో తెలంగాణను దేశానికి ఆదర్శంగా నిలబెట్టారని కొనియాడారు. కార్యక్రమంలో ఎంపీపీ ముద్దప్ప దేశ్‌ముఖ్, రావులపల్లి సర్పంచు రమేశ్ రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ కటుకం శివకుమార్‌గుప్త, రెడ్డప్పదొర, ఎంపీటీసీ శ్రీనివాస్‌రెడ్డి, వన్నె బస్వరాజు, టేకుల్‌కోడ్ సర్పంచు గుండప్ప, రుద్రారం సర్పంచు వెంకటలక్ష్మి, పాటిమీదిపల్లి సర్పంచు బాలమణి తదితరులు పాల్గొన్నారు.

పథకాలు చరిత్రాత్మకం

తాండూరు రూరల్: సిరిగిరిపేట్‌లో జరిగిన రైతు దినోత్సవంలో ఎమ్మెల్సీ పట్నం మహేందర్‌రెడ్డి పాల్గొన్నారు. ఎడ్ల బండిపై రైతువేదిక వద్దకు వచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రైతు శ్రేయస్సే ధ్యేయంగా సీఎం కేసీఆర్ అందిస్తున్న పథకాలు చరిత్రలో నిలిచిపోతాయన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ అనితగౌడ్, జెడ్పీటీసీ మంజుల, పీఏసీఎస్ చైర్మన్ రవిగౌడ్, వైస్ ఎంపీపీ స్వరూపరెడ్డి, సర్పంచ్ రాధిక, ఎంపీటీసీ సుశీలమ్మ, అమ్రేశ్ తదితరులు పాల్గొన్నారు.



రావులపల్లిలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి



మోమిన్‌పేటలో మాట్లాడుతున్న కలెక్టర్ నారాయణరెడ్డి



తాండూరు రూరల్: ఐనెల్లిలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డి



సిరిగిరిపేట్‌లో ఎడ్లబండిపై వస్తున్న ఎమ్మెల్సీ మహేందర్‌రెడ్డి

ఎమ్మెల్సీ పరామర్శ



చికిత్స పొందుతున్న జావీద్‌ను పరామర్శిస్తున్న ఎమ్మెల్సీ మహేందర్‌రెడ్డి

యాలాల: రోడ్డు ప్రమాదంలో గాయపడిన బీఆర్‌ఎస్ పార్టీ నాయకుడిని ఎమ్మెల్సీ మహేందర్‌రెడ్డి శనివారం పరామర్శించారు. కోకట్ గ్రామానికి చెందిన టైలర్ జావీద్ శుక్రవారం రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డాడు. ఈ విషయం తెలుసుకున్న ఎమ్మెల్సీ మహేందర్‌రెడ్డి, మాజీ ఎంపీపీ కరణం పురుషోత్తంరావుతో కలిసి బాధితుడిని పరామర్శించారు. పట్టణంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న జావీద్‌కు మెరుగైన వైద్యం అందించాలని వైద్యులను సూచించారు. ఆయన వెంట గ్రామస్తులు మహమ్మద్, జలీల్ ఉన్నారు.

కార్యాలయాలకు విద్యుత్ కాంతులు



ప్రాథమిక పశువైద్యశాలకు విద్యుత్ లైట్లు అమరుస్తున్న సిబ్బంది

సాక్షి ఎఫెక్ట్..

పెద్దేముల్: 'దశాబ్దికి వెలగని కార్యాలయాలు' అనే శీర్షికతో సాక్షిలో శనివారం ప్రచురితమైన కథనానికి మండల అధికారులు స్పందించారు. ప్రాథమిక పశువైద్య కేంద్రంతో పాటు మండల వనరులు, మహిళా సమైఖ్య పలు శాఖల కార్యాలయాలకు అధికారులు విద్యుద్దీపాలు అమర్చారు. మొదటి రోజు విద్యుత్ దీపాలు ఏర్పాటు చేయకపోవడంతో ఉన్నతాధికారులు మందలించినట్లు సమాచారం.

క్వారీ ఓనర్స్ అధ్యక్ష, కార్యదర్శులకు సన్మానం



క్వారీ ఓనర్స్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులను సన్మానించిన ఎమ్మెల్సీ

తాండూరు టౌన్ : ఇటీవల ఎన్నికైన తాండూరు మండల క్వారీ ఓనర్స్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులను ఎమ్మెల్సీ మహేందర్‌రెడ్డి ఘనంగా సన్మానించారు. శనివారం తాండూరులోని ఆయన నివాసంలో అసోసియేషన్ అధ్యక్షుడు అబ్దుల్ రవూఫ్, ప్రధాన కార్యదర్శి జుబేర్ లాలాను శాలువా, పూల మాలలతో ఘనంగా సన్మానించి, శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు కరణం పురుషోత్తం రావు, పట్లోళ్ల బాల్‌రెడ్డి, నర్సింహులు, రవిగౌడ్, రఘు తదితరులు పాల్గొన్నారు.

ఎద్దులను తరలిస్తున్న డీసీఎం పట్టివేత

కొత్తూరు: డీసీఎం వాహనంలో అక్రమంగా ఎద్దులను తరలిస్తుండగా పోలీసులు పట్టుకున్నారు. రంగారెడ్డి జిల్లా కొత్తూరు పట్టణ కూడలిలో తనిఖీలు నిర్వహిస్తుండగా డీసీఎం వ్యాన్‌లో 17 ఎద్దులను తరలిస్తుండగా స్వాధీనం చేసుకున్నట్లు ఎస్‌ఐ శంకర్ తెలిపారు. అనంతరం వాటిని సమీపంలోని గోశాలకు తరలించినట్లు వివరించారు. అనుమతులతోనే ఎద్దులను తరలిస్తున్నారా? లేదా అనే విషయాలను విచారణ అనంతరం తెలుస్తుందన్నారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

సాగు చేస్తేనే బతుకులు మారుతాయి



కళాకారుల ప్రదర్శన

పెద్దేముల్: ఉన్న భూమి అమ్ముకోవద్దని.. సాగు చేస్తేనే బతుకులు మారుతాయని.. ఆటలు, పాటల రూపంలో కళాకారులు రైతులకు అవగాహన కల్పించారు. శనివారం పెద్దేముల్ మండల కేంద్రంలో రైతు దశాబ్ది ఉత్సవాల కార్యక్రమంలో భాగంగా రైతు వేదికలో తాండూరు ప్రాంతానికి చెందిన అశోక్ డ్యాన్స్ కళాకారుల బృందం కళాజాత నిర్వహించింది. ఈ ప్రదర్శన ఆద్యంతం రైతులను ఆకట్టుకుంది.

కొనుగోలు చేసిన ధాన్యాన్ని తరలించండి



సమీక్షలో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ రాహుల్‌శర్మ

వికారాబాద్ అర్బన్: ధాన్యం అన్‌లోడ్ ప్రక్రియను వేగవంతం చేయాలని రైస్ మిల్లర్లను జిల్లా అదనపు కలెక్టర్ రాహుల్ శర్మ ఆదేశించారు. శనివారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో వరి ధాన్యం సేకరణ ప్రక్రియలో జాప్యంపై రైస్ మిల్లర్లు, రవాణా కాంట్రాక్టర్లు, డిప్యూటీ తహసీల్దార్లతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో చేపడుతున్న వరి ధాన్యం సేకరణ ప్రక్రియలో ప్రతి కాంట్రాక్టర్ 80 వాహనాలు అందుబాటులో ఉంచాలని సూచించినప్పటికీ ఆచరించడం లేదన్నారు. ట్రాన్స్‌పోర్టు వల్లే రైతులు ఇబ్బందులు పడుతున్నారని అదనపు కలెక్టర్ గుర్తు చేశారు. ప్రణాళిక బద్ధంగా తూకం వేసిన ధాన్యాన్ని మిల్లర్లకు చేరే విధంగా చర్యలు తీసుకోవాలని ఆయన సూచించారు. రోడ్ల మీద ఉన్న ధాన్యాన్ని వెంటనే తరలించేందుకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ సందర్భంగా డీసీఎస్‌ఓ రాజేశ్వర్, డీసీఎం విమల, జిల్లా రవాణ అధికారి జోసెఫ్ తదితరులు పాల్గొన్నారు.

అంబులెన్స్‌లో ప్రసవం

కుల్కచర్ల: అంబులెన్స్‌లో మహిళ ప్రసవించిన సంఘటన కుల్కచర్ల మండల పరిధిలో చోటుచేసుకుంది. వివరాలు.. కుల్కచర్ల మండలం బండవెల్కిచర్ల గ్రామానికి చెందిన అంజమ్మకు శుక్రవారం రాత్రి పురిటినొప్పులు రావడంతో 108కి సమాచారం అందించారు. అంబులెన్స్‌లో అంజమ్మను కుల్కచర్ల ఆస్పత్రికి తీసుకెళ్తుండగా పురిటినొప్పులు అధికం కావడంతో ఈఎంటీ వినోద్‌కుమార్ ఆధ్వర్యంలో ఆమెకు అంబులెన్స్‌లోనే ప్రసవం చేశారు. అంజమ్మకు మగబిడ్డ జన్మించారని తల్లీబిడ్డా క్షేమంగా ఉన్నారని సిబ్బంది పేర్కొన్నారు. ఈఎంటీ వినోద్‌కుమార్, పైలట్ నారాయణను గ్రామస్తులు అభినందించారు.

ఆర్టీసీ కార్మికుల వేతనాలు పెంచండి



పరిగి డిపో ఎదుట ఆర్టీసీ కార్మికుల నిరసన

పరిగి: ఆర్టీసీ కార్మికుల వేతనాలు పెంచాలని టీజేఎంయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి హన్మంతు డిమాండ్ చేశారు. శనివారం పరిగి ఆర్టీసీ డిపో ఎదుట ఎర్ర బ్యాడ్జీలు ధరించి ఉద్యోగులు నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా హన్మంతు మాట్లాడుతూ సీఎం కేసీఆర్ ఆర్టీసీ కార్మికుల సమస్యలను పరిష్కరించడంతో విఫలమయ్యారన్నారు. చాలిచాలనీ జీతాలతో ఆర్టీసీ ఉద్యోగులు కుటుంబాలు దుర్భర జీవితాలు గడుపుతున్నారన్నారు. వేతనాలు పెంచాలన్న డిమాండ్‌తో ఈనెల 14న హైదారాబాద్‌లో భారీ బహిరంగసభ నిర్వహిస్తున్నట్లు చెప్పారు.

పాము కాటుకు ఎద్దు మృతి



మృతి చెందిన ఎద్దు

పెద్దేముల్: పాము కాటుకు ఎద్దు మృతి చెందింది. ఈ ఘటన శనివారం పెద్దేముల్ మండలంలో చోటుచేసుకుంది. వివరాలిలా ఉన్నాయి. గోట్లపల్లికి చెందిన ఖదీర్ శనివారం ఉదయం ఎడ్లను మేపేందుకు పొలానికి తీసుకెళ్లాడు. పొలంలో మేత మేస్తున్న సమయంలో పాము కాటు వేసింది. వెంటనే ఎద్దు అక్కడికక్కడే మృతి చెందిందని రైతు ఖదీర్ తెలిపారు. సుమారు 70వేలకు పైగా విలువ చేసే ఎద్దు మృతి చెందిందని, ప్రభుత్వం ఆదుకోవాలని బాధితుడు కోరారు.

సురక్ష దినోత్సవం కరపత్రాల ఆవిష్కరణ



కరపత్రాలు ఆవిష్కరిస్తున్న ఎస్పీ కోటిరెడ్డి

అనంతగిరి: తెలంగాణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా పోలీసుశాఖ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించే సురక్ష దినోత్సవం కరపత్రాన్ని శనివారం ఎస్పీ కోటిరెడ్డి ఆవిష్కరించారు. ఎస్పీ మాట్లాడుతూ.. ఆదివారం ఉదయం 6గంటల నుంచి 10గంటల వరకు జిల్లాలోని అన్ని పీ.ఎస్‌ల పరిధిలోని గ్రామాల్లో, మండల స్థాయిలో బ్లూకాప్స్, కార్ల ర్యాలీ ఉంటుందన్నారు. 10గంటల నుంచి సాయంత్రం 4గంటల వరకు పరేడ్ గ్రౌండ్‌లో స్టాల్స్ ప్రదర్శన, ఓపెన్ హౌజ్ ఉంటుందన్నారు. 4.30 గంటల నుంచి 5.30 గంటల వరకు వికారాబాద్‌లో ర్యాలీ ఉంటుందని.. 6గంటలకు పోలీస్ కార్యాలయం పరేడ్ గ్రౌండ్‌లో పబ్లిక్ మీటింగ్ ఉంటుందన్నారు. ఏఎస్పీ మురళీధర్, అధికారులు పాల్గొన్నారు.

జర దేఖ్‌కే చలో భాయ్

చన్గోముల్– లాల్‌పహాడ్ వెళ్లే ఆర్‌అండ్‌బీ రోడ్డు ప్రమాదకరంగా మారింది. ఈ రోడ్డులో పలుమార్లు ప్రమాదాలు జరిగినా అధికారులు మాత్రం పట్టనట్లు వ్యవహరిస్తున్నారు. పూడూరు మండలం పోతిరెడ్డిగూడ నుంచి లాల్‌పహాడ్ వరకు కల్వర్టులు అధ్వానంగా మారినా మరమ్మతులు చేపట్టడంలేదు. ఎక్కడ చూసినా గుంతలమయంగా మారడంతో పాటు వర్షానికి కల్వర్టులు సగానికి పైగా ధ్వంసమయ్యాయి. కనీసం సూచికబోర్డులు కూడా ఏర్పాటు చేయలేదు. రాత్రి వేళల్లో ఆదమరిస్తే ఇక అంతే సంగతులు.. ఇప్పటికైనా ఆర్‌అండ్ బీ అధికారులు తక్షణం చర్యలు చేపట్టాలని వాహనదారులు కోరుతున్నారు.

– పూడూరు



చన్గోముల్ సమీపంలో కల్వర్టు దుస్థితి